క్లుప్తంగా

గురుకుల పాఠశాలలో వైద్య శిబిరం

రాచర్ల: మండలంలో రాచర్ల ఫారం గ్రామ సమీపంలోని గురుకుల బాలికల పాఠశాలలో అనుమలవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కె.రమేష్ అధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఎంఈఓ వారణాసి గిరిధర్ శర్మ పాఠశాల పరిసరాలను పరిశీలించి సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ ప్రసాద్, పాఠశాల ప్రిన్సిపాల్ మేరీ మంజుల, మలేరియా యూనిట్ హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న యూనియన్ జిల్లా అధ్యక్షుడు రమణ

మార్కాపురం: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఏపీయూడబ్ల్యూజే రాజీలేని పోరాటం నిర్వహిస్తోందని యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎన్వీ రమణ పేర్కొన్నారు. సంఘ 69వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా జీజీహెచ్‌లోని రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ప్రభుత్వం త్వరితగతిన అక్రెడిటేషన్ కార్డులు మంజూరు చేయాలని, హెల్త్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ పాలసీ సౌకర్యాలు కల్పించాలని కోరారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జర్నలిస్టులు మల్లికార్జున, డి.జగన్నాథరెడ్డి, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు బాజీవలి, కోశాధికారి శరత్‌కుమార్, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయండి



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మార్కాపురం: ఈనెల 23వ తేదీన ఒంగోలులో నిర్వహించనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకుడు అందె నాసరయ్య తెలిపారు. ఆదివారం మార్కాపురంలోని పార్టీ కార్యాలయంలో రాష్ట్ర మహాసభలకు సంబంధిందిచిన వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెలుగొండ ప్రాజెక్టుకు 2 వేల కోట్ల రూపాయలు కేటాయించాలని, మార్కాపురాన్ని జిల్లా చేయాలని, పేదలకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు షేక్ ఖాశిం, నియోజకవర్గ కార్యదర్శి దుప్పట్ల కాశయ్య, శేఖర్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవాసమితి రక్తదాన శిబిరం

పెద్దదోర్నాల: సత్యసాయి బాబా జయంతిని పురస్కరించుకుని శతాబ్ది ఉత్సవాల సందర్భంగా ఆదివారం మండల కేంద్రంలోని సత్యసాయి సేవా మందిరంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. సత్యసాయి యువజన విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో యువకులు స్వచ్ఛందగా పాల్గొని రక్తదానం చేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.



గొట్లగట్టులో బస్ రద్దీగా ఉండటంతో ఎక్కలేకపోయిన ప్రయాణికులు



బస్ వెళ్లాక ఆటోను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు

ఉచిత బస్సు.. తుస్సు!

- బస్సుల కోసం మహిళా ప్రయాణికుల పడిగాపులు
- సర్వీసులు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర అసహనం
- ఇప్పటికీ గ్రామాలకు తిరగని పల్లె వెలుగు బస్సులు
- ఉచిత బస్సు పథకంతో ఒరిగిందేమీ లేదని జనం ఎద్దేవా



కంభం : బస్సు కోసం బస్టాండ్‌లో వేచి ఉన్న మహిళలు

కొనకనమిట్ల/కంభం: ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం అందిస్తున్న ప్రభుత్వం అందుకు సరిపడా బస్సులు డిపోలలో అందుబాటులో ఉంచకపోవడం, కొన్ని సర్వీసులకే ఉచిత ప్రయాణం వెసులు పాటు కల్పించడంతో మహిళలు తంటాలు పడుతున్నారు. కంభం నుండి గిద్దలూరు, మార్కాపురం, ఒంగోలు, విజయవాడ వైపు ప్రజలు ఎక్కువగా ప్రయాణం చేస్తుంటారు. బస్టాండుకు వచ్చిన మహిళలు సరైన సమయంలో బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. దూర ప్రాంతాలకు వెళ్ళే సూపర్ లగ్జరీ, అల్ట్రా డీలక్స్ బస్సుల్లో ఉచితం లేక పోవడంతో వాటిలో ఎక్కలేక ఫ్రీ బస్సులు సమయానికి రాక వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. దానికి తోడు కంభం బస్టాండులో ప్రయాణికులు కూర్చునేందుకు సరైన వసతులు లేకపోవడంతో మహిళలు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని రకాల సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు కల్పించడంతోపాటు బస్సుల సంఖ్య పెంచాలని పలువురు మహిళలు కోరుతున్నారు.

పల్లె వెలుగు బస్సులెక్కడ?

పల్లె వెలుగు పేరుతో తిప్పుతున్న బస్సులు గ్రామాలకు దూరంగా పోతున్నాయి. ప్రధాన రహదారుల్లో ఎక్కువగా ఎక్స్‌ప్రెస్, డీలక్స్, లగ్జరీ బస్సులు తిరుగుతండటంతో మహిళలకు ఏమాత్రం ఉపయోగం లేకుండా పోయింది. ఎప్పుడో అరకొరగా వచ్చే పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం గంటల తరబడి వేసి ఉండాల్సి వస్తోందని, ఒక వేళ బస్సుల కోసం వేచి ఉన్నప్పటికీ అప్పటికే ప్రయాణికులు నిండుగా ఉండటంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఆదివారం గొట్లగట్టు బస్టాండ్ నుంచి మహిళలతో పాటు పురుషుల పొదిలి, ఒంగోలు వెళ్లేందుకు బస్ కోసం వేచి ఉన్నారు. నాగంపల్లి, చినమనగుండం, నాయుడుపేట గ్రామాలకు చెందిన సుమారు 25 మంది వరకు ఆటోలో వచ్చి గొట్లగట్టు బస్టాండ్‌లో ఉండగా గిద్దలూరు నుంచి ఒంగోలు వెళ్లే బస్ వచ్చింది. అప్పటికే రద్దీగా ఉన్న బస్‌లో ఎక్కేందుకు ఖాళీ లేకపోవడంతో 20 మంది ప్రయాణికులు ఆటోల్లో వెళ్లడం కనిపించింది. గిద్దలూరు నుంచి ఒక్క పల్లెవెలుగు బస్ కూడా లేకపోవడం, ఉన్న బస్‌లు ఎక్స్‌ప్రెస్, డీలక్స్, లగ్జరీ బస్‌లు కావటంతో పైనుంచే బస్‌లు ఫుల్ అయి వస్తున్నాయి. పొదిలి–బేస్తవారిపేట మధ్యలో గొట్లగట్టు, తాడివారిపల్లిలో మాత్రమే బస్‌లకు స్టేజీ సౌకర్యం ఉంది. సలకలవీడు, రావిపాడు, చినఓబినేనిపల్లి, మహమ్మాదాపురం, చినమనగుండం, పాతపాడు, బచ్చలకూరపాడు, చినారికట్ల జంక్షన్, కంభాలపాడు గ్రామాలకు బస్ స్టేజీ లేకపోవటంతో అక్కడ బస్‌లు ఆపరు. వారంతా ఆటోలు, బైక్‌లు మీద ప్రయాణంచాల్సి ఉంది. పొదిలి, కొనకనమిట్ల మండలాలకు సంబంధించి గతంలో బస్సులు నడిపిన రూట్లలో కూడా ప్రస్తుతం బస్సులు రద్దయ్యాయి. పొదిలి డిపో నుంచి సుమారు 81 బస్సులు నడుస్తుంటాయి. పల్లెటూర్లకు మాత్రం నామమాత్రపు సర్వీసులనే తిప్పుతున్నారు.

పొదిలి–కంభం షటిల్ సర్వీసులు నడపాలి

ప్రస్తుత పరిస్థితుల్లో పొదిలి–కంభం, పొదిలి–మార్కాపురం, పొదిలి–దొనకొండ వరకు పల్లెవెలుగు బస్‌లను తిప్పాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఆయా రూట్లలో పల్లె వెలుగు బస్‌లు లేకపోవడంతో ఆటోలను ఆశ్రయించాల్సి వస్తోందని ప్రయాణికులు వాపోతున్నారు. కంభం నుంచి పొదిలి మధ్యలో మూడు చోట్ల మాత్రమే ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లకు స్టేజీ సౌకర్యం కలిపించారు. అలాగే మార్కాపురం, పొదిలి మధ్యలో కొనకనమిట్లలో మధ్యలో స్టేజీ కల్పించడంతో మిగతా గ్రామాల నుంచి ప్రయాణించే వారికి పల్లె వెలుగు బస్‌లు లేక ఇబ్బందులు పడుతున్నారు. గతిలేని పరిస్థితిలో ఆటోలు ఎక్కి ప్రమాదాలకు గురవుతున్నారు. ఆర్టీసీ ఉన్నతాధికారులు స్పందించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా బస్‌లు నడపాలని ప్రయాణికులు కోరుతున్నారు.

కొమరోలులో తాగునీటికి కటకట



కొమరోలు : మరమ్మతులకు గురైన డీప్‌బోర్

కొమరోలు: మండల కేంద్రమైన కొమరోలులో గత 3 రోజులుగా మంచినీటికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొమరోలులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉన్న డీప్ బోరు మరమ్మతులకు గురైనా పంచాయతీ అధికారులు పట్టించుకోలేదు. దీంతో కొమరోలులోని ప్రధాన రహదారిలో నివాసం ఉంటున్నవారు మంచినీటికి ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత కార్యదర్శికి 3 రోజుల క్రితమే సమస్య తెలియజేసినా స్పందించలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మరో ప్రాంతం నుంచి బిందెలతో నీరు తెచ్చుకోలేకపోతున్నామని, సంబంధిత అధికారులు స్పందించి డీప్‌బోర్‌ను బాగు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

వైరల్ జ్వరాల బాధితులతో జీజీహెచ్ కిటకిట



మరో వార్డులో చికిత్స పొందుతున్న వైరల్ ఫీవర్ బాధితులు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రజలు వైరల్ జ్వరాలతో సతమతమవుతున్నారు. వర్షాలు కురుస్తుండటం, పారిశుధ్య పనులు చేపట్టకపోవడంతో వైరల్ జ్వరాలు సోకి తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యశాలల బాట పడుతున్నారు. రోడ్లపై చెత్తాచెదారం, డ్రైనేజీ కాలువల్లో మురుగు నిల్వ ఉండటంతో దోమల ఉధృతి ఎక్కువైంది. ప్రభుత్వం పారిశుధ్య పనులపై దృష్టి సారించకపోవడంతో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కొందరు ప్రైవేట్ వైద్యశాలల్లో చికిత్స పొందుతుండగా మరికొందరు మార్కాపురం పట్టణంలోని జీజీహెచ్‌కు క్యూకడుతున్నారు. జీజీహెచ్‌లో జ్వర పీడితులకు ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేసి చికిత్స అందిస్తుండటం పల్లెల్లో పరిస్థితికి అద్దం పడుతోంది.



పురుషుల వార్డులో చికిత్స పొందుతున్న జ్వర పీడితులు

కార్మికులకు ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలి



నూతన కమిటీ సభ్యులతో సీఐటీయూ నాయకులు

మార్కాపురం టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి డీకేఎం రఫీ డిమాండ్ చేశారు. ఆదివారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సీఐటీయూ) పట్టణ మహాసభ, నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల ఉపాధిని దూరం చేసే వర్క్, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని తీసుకొచ్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఆప్కాస్‌ను రద్దు చేసి టెండరు విధానాన్ని తీసుకునివచ్చి కాంట్రాక్టర్లకు కట్టబెట్టే ప్రయత్నాన్ని మానుకోవాలన్నారు. ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్, సెమీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలని కోరారు. 60 ఏళ్లు నిండిన వారికి ఎలాంటి బెనిఫిట్స్ ఇవ్వకుండా అన్యాయంగా తొలగించవద్దని, కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, షరతులు లేకుండా ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నూతన కమిటీ ఎన్నిక

ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నూతన కమిటీ అధ్యక్షుడుగా కె.సుబ్బారాయుడు, కార్యదర్శిగా గొట్టం హరికృష్ణ, ఉపాధ్యక్షుడిగా ఎం.చెన్నకేశవులు, సహాయ కార్యదర్శులుగా ఎ.రమణ, పీఏ బ్రహ్మం, కోశాధికారిగా డి.చిన్నరాయుడు, గౌరవ అధ్యక్షుడిగా సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.రూబెన్, గౌరవ సలహాదరులుగా సలాంఖాన్‌తోపాటు 13 మంది కమిటీ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు



ఉభయదేవేరులతో చెన్నకేశవస్వామివారు



నెహ్రూబజారులో ఉట్టి కొడుతున్న యాదవ సంఘ సభ్యులు

మార్కాపురం:

మార్కాపురం పట్టణంలోని నెహ్రూ బజారులో షిరిడీ సాయిబాబా మందిరంలో ఆదివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను అఖిల భారత యాదవ మహా సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉట్టికొట్టే కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహంగా సాగింది. కార్యక్రమంలో బీసీ సంఘం జాతీయ కార్యదర్శి పీయల్‌పి యాదవ్, కాటంరాజు దేవస్థాన కమిటీ ప్రధాన కార్యదర్శి చిన్న వెంకటేశ్వర్లు యాదవ్, డివిజన్ యాదవ సంఘ ప్రముఖుడు అల్లూరయ్య యాదవ్, యువత విభాగం అధ్యక్షుడు పి.శివకుమార్ యాదవ్, వెంకటేష్ యాదవ్, అమర్‌నాథ్ యాదవ్, రమేష్ యాదవ్, శశాంక్ యాదవ్‌లతోపాటు ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నంది యూత్ ఆధ్వర్యంలో..

పట్టణంలోని కొండేపల్లి రోడ్‌లో శ్రీకృష్ణుడి బాల్య లీలలను ప్రతిబింబించే ఉత్సవం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నంది యూత్ సభ్యులు ఉట్టికొట్టారు. గుంటక వనజాక్షి ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన అందరినీ అలరించింది. కార్యక్రమంలో ప్రజలు, మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చెన్నకేశవస్వామి ఆలయంలో..

మార్కాపురం టౌన్: శ్రీదేవి భూదేవి సమేత శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో కృష్ణాష్టమి వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉభయ దేవేరులతో చెన్నకేశవస్వామివారిని ఆలయ అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు, అర్చక బృందం ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఉట్టి మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులను ప్రతిష్ఠించి పూజించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఉట్టికొట్టే ఉత్సవంలో యువకులు పోటాపోటీగా పాల్గొన్నారు. ఏర్పాట్లను ఆలయ ఈఓ శ్రీనివాస రెడ్డి, సిబ్బంది, ఉభయదాతలు పర్యవేక్షించారు.



చెన్నకేశవాలయంలో ఉట్టికొడుతున్న యాదవ సంఘ యువకులు

పేదలు మరణిస్తే మట్టి ఖర్చులు అందిస్తా



సర్వమత ప్రార్థనల్లో కృష్ణారెడ్డి, సంస్థ సభ్యులు

- ఏపీఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ ఆవుల కృష్ణారెడ్డి

పొదిలి: పేదలు మృతి చెందిన సందర్భాల్లో వారి కుటుంబ సభ్యులకు మట్టి ఖర్చుల కోసం ఆర్థిక సాయం ఏడాదిపాటు అందిస్తానని ఏపీఆర్ గ్రూపు సంస్థల చైర్మన్ ఆవుల కృష్ణారెడ్డి పేర్కొన్నారు. స్థానిక దర్శి రోడ్డులో నూతనంగా నిర్మించిన మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కార్యాలయ భవనాన్ని ఆదివారం ఆయన ప్రారంభించారు. సంస్థ కార్యాలయానికి 150 కుర్చీలు అందజేశారు. అనంతరం భవన నిర్మాణానికి రూ.10 లక్షల విరాళం అందించిన కృష్ణారెడ్డి, ఆయన తండ్రి ఓబులక్కపల్లి సర్పంచ్ ఆవుల వెంకట సుబ్బారెడ్డి, సోదరుడు సంజీవరెడ్డిని సంస్థ సభ్యులు ఘనంగా సన్మానించారు. ముందుగా సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ చైర్మన్ మువ్వల పార్థ సారథి, సభ్యులు శ్రావణి వెంకటేశ్వర్లు, కల్లం వెంకట సుబ్బారెడ్డి, బండి అశోక్, బాజీ కరీముల్లా, వరికూటి శిరీష తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అల్లూరి పోలేరమ్మ తల్లి

మార్కాపురం టౌన్: పట్టణ శివారులోని అల్లూరి పోలేరమ్మ ఆలయంలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యంగా సమర్పించి మొక్కులు చెల్లించారు. ఆలయ సమీపంలోని పుట్ట, నాగశిలలకు పూజలు చేశారు. ఆలయ అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. అలాగే పట్టణంలోని కళాశాల రోడ్డులో ఉన్న పోలేరమ్మ తల్లి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా రంగనాయక స్వామి విగ్రహ ప్రతిష్ఠ

మార్కాపురం: మండలంలోని బోడపాడు గ్రామంలో ఆదివారం శ్రీదేవి భూదేవి సమేత రంగనాయక స్వామి ఆలయ నూతన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఆదివారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలు, నూతన శిలాధ్వజం, విమాన గోపురం, కలశ ప్రతిష్ఠ, గరుడ వాహన విగ్రహ ప్రతిష్ఠ పూజలకు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. వైఎస్సార్ సీపీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు అన్నా రాంబాబును ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు చెంచిరెడ్డి, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ధ్వజ స్తంభానికి పూజలు చేస్తున్న అన్నా రాంబాబు

కోటసత్యమాంబదేవి ఆలయంలో..



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లిలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. మండలంలోని ఎంపీ చెరువులో కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేశారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

అర్ధవీడు: శ్రావణ మాసం, ఆదివారం సందర్భంగా మండలంలోని అంకభూపాలెం, పాపినేనిపల్లె గ్రామాల్లో పోలేరమ్మ తల్లికి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారిని మూలవిగ్రహమూర్తులను పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించారు. కంచి నుంచి వేదపండితులను ఆహ్వానించి భక్తి శ్రద్ధలతో హోమాలు నిర్వహించారు. చిన్నారుల తలనీలాలు సమర్పించి, అమ్మవారికి పొంగళ్లు పెట్టి మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్న సంతర్పణ చేశారు.



ఎంపీ చెరువులో బోనాల ఊరేగింపు

వాహనదారులకు ప్రాణ సంకటం.. అధికారుల తీరుపై కంపరం!



పిటికాయగుళ్ల మూలమలుపు రోడ్డును కమ్మేసిన చిల్లచెట్లు

- రోడ్లపైకి పెరిగిన చిల్లచెట్లతో పొంచి ఉన్న ప్రమాదం

బేస్తవారిపేట: మండలంలోని కోనపల్లె రోడ్డులో పిటికాయగుళ్ల కాశీనాయన ఆలయం సమీపంలో మూలమలుపు ప్రమాదకరంగా మారింది. రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించని పరిస్థితి నెలకొంది. రోడ్డుకు ఇరువైపులా లోతుగా ఉన్న మార్జిన్లు, భారీగా పెరిగిన చిల్లచెట్లు వాహనదారులకు ప్రాణ సంకటంగా మారాయి. అలాగే మండలంలోని ఖాజీపురం బస్టాండ్ నుంచి గ్రామంలోకి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా 2 కి.మీ మేర దట్టంగా చిల్లచెట్లు పెరిగిపోయాయి. దీంతో ఆ రహదారి వెంట రాకపోకలు సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. చిన్నపాటి మూలమలుపుల్లో సైతం ఎదురుగా వచ్చే వాహనాలు ఢీకొని ప్రమాదం బారిన పడుతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు తక్షణమే స్పందించి రహదారుల వెంట జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు.



ఖాజీపురం తారురోడ్డులో ఏపుగా పెరిగిన చిల్లచెట్లు

వైభవంగా రాధాకృష్ణుల కళ్యాణం

ఒంగోలు మెట్రో: స్థానిక మంగమూరు రోడ్డు మరిచెట్లకాలనీలోని శ్రీ రాధాకృష్ణ మందిరంలో కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా ఆదివారం ఉదయం రాధాకృష్ణుల కళ్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. నిర్వాహకులు దేవస్థాన ఆవరణలో చూడచక్కని కళ్యాణ వేదిక ఏర్పాటు చేశారు. వేదికపై రాధాకృష్ణులను కొలువుదీర్చి భక్తుల హర్షధ్వానాల నడుమ కళ్యాణం జరిపించారు. ముందుగా దేవేరులను కంకణధారులను చేసి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు.